క్లుప్తంగా

15న మండల సమావేశం

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరం


దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరమని పీలేరు సహాయ కార్మిక అధికారి ఆనంద బాబు తెలిపారు. కల్లూరులో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, బాల కార్మికులను పనిలో చేర్చుకుంటే చట్టరీత్యా నేరమని తెలిపారు. విద్యార్థులతో కలిసి కల్లూరులోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, సబిత, మురళి, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు

పుంగనూరు: పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఏడూరు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పట్టణంలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీసోమేశ్వరస్వామి, శ్రీచాముండేశ్వరి, సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో పౌర్ణమి పూజలు నిర్వహించారు.

50 మందికి వైకల్య పరీక్షలు

పుంగనూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సదరన్‌క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మధుసూదనచారి ఆధ్వర్యంలో డాక్టర్ తేజ్ సందీప్‌రాజ్ 50 మంది దివ్యాంగులకు వైకల్య తీవ్రత పరీక్షలు నిర్వహించారు. వారి వైకల్యాన్ని బట్టి సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఈ క్యాంపు ద్వారా వైకల్య ధువపత్రాలు పొందనున్నట్లు తెలిపారు.

అబాకస్ పోటీల్లో పలమనేరు విద్యార్థి ప్రతిభ


పోటీల్లో సత్తా చాటిన చరణ్

పలమనేరు: ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర అబాకస్ పోటీల్లో మండలంలోని జల్లిపేటకు చెందిన దేవేంద్ర కుమారుడు చరణ్ మంచి ప్రతిభ చూపి ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు తల్లిదండ్రులు బుధవారం తెలిపారు. త్వరలో జరిగే జాతీయ అబాకస్ పోటీలకు చరణ్ ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

జామ్.. ట్రాఫిక్ జామ్!

- ఉదయం, సాయంత్రం స్తంభించిపోతున్న ట్రాఫిక్
- వన్‌సైడ్ పార్కింగ్ పెట్టినా తీరని ట్రాఫిక్ సమస్య
- బొమ్మిదొడ్డి రోడ్డును వినియోగించుకోని యంత్రాంగం
- 80 అడుగుల రోడ్డును పట్టించుకోని అధికారులు


మదనపల్లి రోడ్డులో బారులు తీరిన విద్యాసంస్థల బస్సులు


చర్చి రోడ్డులో..

పలమనేరు: పట్టణంలో జనాభా ఇప్పుడు 80వేలకు చేరింది. ఉన్న రోడ్లపై వాహనాల రాకపోకలు రెట్టింపయ్యాయి. ద్విచక్ర వాహనాల వినియోగం కోవిడ్ తర్వాత భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఎప్పుడో దశాబ్దాల క్రితం వేసిన రోడ్లతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం విద్యా సంస్థల వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీనికి శాశ్వత పరిష్కారంపై స్థానిక మున్సిపల్ అధికారులు దృష్టిని సారించడం లేదనే చర్చ మొదలైంది.

పట్టణానికి ఉత్తరం వైపు సమస్య లేదు

పట్టణానికి ఉత్తరంవైపు నేషనల్ హైవే శాఖ బైపాస్ రోడ్డును స్థానిక నాగమంగళం నుంచి గంటావూరు ఫ్లైఓవర్ వరకు గతంలో నిర్మించారు. దీంతో ఈ ప్రాంతం గుండా ఎక్కువగా వాహనాలు వెళుతుండడంతో ఇటువైపు ట్రాఫిక్ సమస్య తీరింది. అయితే స్థానిక మదనపల్లి రోడ్డులో గుండుబావి నుంచి దండపల్లి రోడ్డు మీదుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆర్టీవో కార్యాలయాల మీదుగా ఉన్న ఇన్నర్ రోడ్డును కాస్త విస్తరిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. ఈ సమస్యలను మున్సిపల్ అధికారులు చొరవచూపితే పట్టణంలో భారీగా ట్రాఫిక్ సమస్య తీరడం ఖాయం. కనీసం మున్సిపల్ పాలకమండలి అయినా ఈ దిశగా ఆలోచించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వన్‌సైడ్ పార్కింగ్

పట్టణంలో నిత్యం ప్రజలకు ఇబ్బందిగా మారుతున్న ట్రాఫిక్ సమస్యపై స్థానిక ఎస్‌ఐ స్వర్ణతేజ సిబ్బందితో కలిసి పలు రద్దీ వీధుల్లో వన్‌సైడ్ పార్కింగ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. స్థానిక మంజునాథ సర్కిల్, బజారువీధి, అంబేడ్కర్ సర్కిల్, గుడియాత్తం రోడ్డు, టీకే వీధి, సరస్వతి హోటల్, గంగమ్మగుడి వీధుల్లో ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు.

80 అడుగుల రోడ్డును గాలికొదిలేశారు

పట్టణంలోని కూర్మాయి రోడ్డునుంచి ఎక్స్‌ప్రెస్ హైవే సమీపంలో మొదలయ్యే ఈ రోడ్డును గతంలో బ్రిటీష్ అధికారులు 80 అడుగుల రోడ్డుగా భవిష్యత్తులో పట్టణానికి అవుటర్ రింగ్‌రోడ్డుగా ఉంటుందని అప్పట్లోనే ఆలోచించి వేశారు. కానీ ఈ రోడ్డు ఇప్పుడు పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. ఇటీవల ఈ రోడ్డులోని సీఎస్‌ఐ ట్రస్టు స్కూల్ వద్ద కొందరు రియల్టర్లు రోడ్డును ఆక్రమించుకొని వెంచర్లు వేసేశారు. దీనిపై ఆలస్యంగానైనా స్పందించిన మున్సిపల్ అధికారులు రెండ్రోజులుగా ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఈ రోడ్డు ఆక్రమణలను తొలగించి బాగు చేస్తే ఈ మార్గంలో పలు భారీ వాహనాలు సైతం పట్టణ ఆవాస మార్గం ద్వారా బైపాస్‌లో వెళ్లే అవకాశం ఉంటుంది.


80 అడుగుల బైపాస్ రోడ్డులో జరిగిన ఆక్రమణలు


అధ్వాన్నంగా మారిన బొమ్మిదొడ్డి రోడ్డు

ఇన్నర్ బైపాస్‌ను అభివృద్ధి చేయలేదే!

పట్టణంలోని హైవే రోడ్డుపై ఏదేని ట్రాఫిక్ సమస్య వస్తే వాహన రాకపోకలను స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని లక్ష్మీనగర్ కాలనీ, జూనియర్ కళాశాల, బొమ్మిదొడ్డి రోడ్డు వైపు మళ్లిస్తారు. అయితే దీనిపై ఇక్కడి అధికారులు అసలు పట్టించుకోలేదు. ఈ మార్గంలో రోడ్డు దెబ్బతింది. పలుచోట్ల గుంతలు పడ్డాయి. ముఖ్యంగా జూనియర్ కళాశాల నుంచి బొమ్మిదొడ్డి మార్గంలో నాలుగైదు ప్రైవేటు పాఠశాలలున్నాయి. దీంతోపాటు బొమ్మిదొడ్డి గ్రామంలో ఇరుకైన రోడ్డు కారణంగా ఇబ్బందులు తప్పడంలేదు. స్వచ్ఛాంధ్ర పేరు చెప్పుకుంటున్న ఇక్కడి మున్సిపల్ అధికారులు బొమ్మిదొడ్డి రోడ్డుకు ఆనుకొని వేసిన పేడదిబ్బలను సైతం తొలగించలేని దుస్థితిలో ఉన్నారు. పలు రకాల నిధుల ద్వారా మున్సిపాలిటీలో రోడ్లను వేస్తున్న అధికారులు లక్ష్మీనగర్ కాలనీ నుంచి బొమ్మిదొడ్డి మీదుగా హైవేలోని పాత పల్లెరుచులు హోటల్ వరకు ఉన్న పాత రోడ్డుపై ఏమాత్రం ఫోకస్ పెట్టడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయం లేకుండా పోతోంది.

మున్సిపల్ కౌన్సిలర్లతో జెడ్పీ చైర్మన్ భేటీ


కౌన్సిలర్లతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మున్సిపల్ కౌన్సిలర్లతో బుధవారం భేటీ అయ్యారు. మున్సిపాలిటీకి సంబంధించిన పలు విషయాలపై ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, టౌన్‌కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు మండీసుధా, రహీంఖాన్, శ్యామ్, నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

తడి చెత్త - పొడి చెత్తపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పట్టణంలోని మహిళా గ్రూపు సభ్యులకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో బుధవారం తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ చెత్తను వేరు చేసి డంపింగ్‌కు పంపడం వలన రీసైక్లింగ్ సులభతరమవుతుందన్నారు. దీంతో పట్టణంలో కాలుష్యం తగ్గుతుందని సూచించారు. డంపింగ్ యార్డులో తయారుచేసే సేంద్రియ ఎరువుతో మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం బాబా, శానిటేషన్ విభాగ సిబ్బంది, గ్రూపులీడర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

కనులపండువగా కాలభైరవుడి కల్యాణం


స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని కుప్పనపల్లె సమీపంలో వెలసిన శ్రీ కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కల్యాణం శాస్త్రోక్తంగా సాగింది. ఉభయదారులుగా గాయత్రి, సుభాష్, క్రిష్ణప్ప, రఘుగౌడు, మునేగౌడు, సంతోష్ వ్యవహరించారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

మసెమ్మ జాతర ప్రారంభం


ప్రత్యేక అలంకారంలో మసెమ్మ

పుంగనూరు: మండలం ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లె గ్రామంలో బుధవారం రాత్రి మసెమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి పుష్పపల్లకిని గ్రామంలో ఊరేగించారు. వేలాది మంది భక్తుల నడుమ అమ్మవారిని ఊరేగింపు చేసి, గురువారం ఉదయం భక్తులకు దర్శనం కల్పిస్తారు. అమ్మవారికి జంతుబలులు సమర్పించి, భక్తులు చలిపిండి, దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటారు. ఆ రాత్రి అమ్మవారిని ఊరేగింపు చేసి, నిమజ్జనం నిర్వహిస్తారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేయనున్నారు. రెండు రోజుల పాటు జరిగే జాతరకు సుమారు 30 గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్



పలమనేరు: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, కుప్పం: సమావేశాన్ని నిర్వహిస్తున్న జడ్జి

పలమనేరు: పట్టణ సమీపంలోని కోర్టు వద్ద మార్చి 8న జరిగే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి సూచించారు. ఆ మేరకు స్థానిక కోర్టులో బుధవారం సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, జూనియర్ సివిల్ జడ్జి లిఖితతో కలిసి ఆమె పోలీసులు, బ్యాంకర్లు, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ, రాజీయే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని ప్రశాంతంగా ఉండేలా జీవించాలన్నారు. ఇందులో ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని సూచించారు. చెక్ బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ముఖ్యంగా పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి పోలీసులు, లాయర్లు కృషిచేయాలని సూచించారు.

అదాలత్‌ను విజయవంతం చేయండి

కుప్పం: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి భారతి కోరారు. కోర్టు ప్రాంగణంలో బుధవారం బార్ అసోసియేషన్, పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కుప్పం కోర్టులో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. సివిల్, క్రిమినల్ కేసులను కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేయాలని సూచించారు. క్షణికావేశంలో నమోదు చేసిన కేసుల వల్ల భవిష్యత్తులో జరిగే అనర్థాలపై కక్షిదారులకు వివరించాలని వారు సూచించారు. జరగబోయే లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యే దిశగా పోలీసులు, న్యాయ వాదులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, డీఎస్పీ పార్థసారథి, సీఐలు మల్లేశ్ యాదవ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

యల్లమ్మా కరుణించమ్మా..


ఆలయం వద్ద దీపాలు సమర్పిస్తున్న మహిళలు

పెద్దపంజాణి: యల్లమ్మా కరుణించమ్మా అంటూ నాగిరెడ్డిపల్లె పంచాయతీకి చెందిన సూరకుంట్ల గ్రామస్తులు మంగళవారం రాత్రి పూజలు చేశారు. ప్రతి ఏటా గ్రామ దేవతలకు పూజలు చేసి దీపాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో మహిళలు భక్తి పారవశ్యాన్ని చాటుతూ ఉపవాస దీక్షలతో మేళతాళాల నడుమ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి శాంతి పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామం మొత్తం బంధు మిత్రులతో కిటకిటలాడింది.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలి



వారణాసివారిపల్లెలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రొంపిచెర్ల: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ పెంచుకోవాలని ఏడీఏ శివశంకర్ రెడ్డి అన్నారు. ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రొంపిచెర్ల, పెద్దమల్లెల గ్రామ పంచాయతీల్లో వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలతో మనుషులకు ఎలాంటి వ్యాధులూ రావన్నారు. ఈ పంటలకు మంచి గిట్టుబాటు ధర కూడా ఉంటుందని చెప్పారు. ఈ పంటల సాగు కోసం ఎరువులను మనమే తయారు చేసుకోవచ్చని చెప్పారు. వారణాసివారిపల్లెకు చెందిన రైతు శ్రీహరి తన పొలంలో వేరుశనగ పంటతోపాటు ఎనిమిది రకాల పంటలను సాగు చేయడం సంతోషకరమన్నారు. ఈ విధంగా పంటలు సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమేష్, సుధారాణి, కోమల, అనంతలక్ష్మి, నాగేశ్వరి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



కుప్పం: పురవీధుల్లో ఊరేగుతున్న రథం, వి.కోట: ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు


రథంపై ఊరేగుతున్న శ్రీ వేణుగోపాలస్వామి

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టణానికి చెందిన పి.రామూర్తి నాయుడు, పి.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పిఎం బసప్ప వారి కుటుంబీకుల ఆధ్వర్యంలో వైభవంగా రథోత్సవ కార్యక్రమం చేపట్టారు. రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై స్వామివారిని కొలువుతీర్చారు. మొదట రథానికి ప్రత్యేక పూజలు, కలశ ప్రతిష్ఠ నిర్వహించారు, అనంతరం శాస్త్రోక్తంగా వేదపండితులు స్వామి వారిని రథంపై కొలువుదీర్చారు. అనంతరం వేలాది మంది భక్తుల స్వామి నామాలను స్మరిస్తూ రథంపై ఉప్పు, అరటి పండ్లు, పూలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారు కొలువుదీరిన రథాన్ని లాగడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. చుట్టు పక్కల ప్రజలే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రథం ముందు కోలాటాలు, మంగళవాయిద్యాలు, పొడుగు కాళ్ల నృత్యాలు, బుట్టబొమ్మలు, కీలుగుర్రాలు భక్తులను అలరించాయి. పట్టణంలో స్వామి వారికి అడుగడుగునా మహిళలు హారతులు పట్టి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద ఉభయదారులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి స్వర్ణ, జయమ్మ, నళిని, స్వాతి వారి ఆధ్వర్యంలో స్వామి వారికి ధూళి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిఎస్ లక్ష్మి, ఉభయదారులు హరినాథ్, గోపినాథ్, రాజా, రమేష్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

రథంపై సోమేశ్వరస్వామి విహారం

కుప్పం: పట్టణంలోని సోమేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణం పాతపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో వారం రోజులుగా మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. పౌర్ణమి పర్వదినాన రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ప్రాంగణం నుంచి పైబాట, విజయలక్ష్మీరోడ్డు, గాంధీవీధి, నేతాజీ రోడ్డు వరకు ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించారు.


వి.కోట: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


పట్టణంలో రథం లాగుతున్న భక్తులు

ప్రమాదమని తెలిసినా.. రోడ్లపైనే ఒబ్బిడి


ఒబ్బిడికి రోడ్డుపై వేసిన ఉలవ పంట

చౌడేపల్లె: ప్రమాదమని తెలిసినా రోడ్లపై పంట ఒబ్బిడి చేస్తున్నారు. దీన్ని అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఉలవపంటను ఖర్చు లేకుండా ఒబ్బిడి చేసేందుకు ఆ తీగలను రోడ్లపై వేసేస్తున్నారు. ప్రధానంగా చౌడేపల్లె-బోయకొండ, చౌడేపల్లె-పలమనేరు, ఏ.కొత్తకోట-పుంగనూరు రోడ్లపై ఈ పంట ఒబ్బిడి అధికంగా చేస్తున్నారు. దీంతో వాహనదారులు వాటిపై ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలకు ఇంజిన్ భాగంలో తీగలు తగులుకుంటే బ్రేకులు పడకుండా పోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

విద్యుదాఘాతంతో గోశాల ఆవు మృతి?


గోశాల వద్ద మృతి చెందిన ఆవు

చౌడేపల్లె: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన బుధవారం బోయకొండ గంగాపురంలోని గోశాల వద్ద వెలుగు చూసింది. బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు విరాళంగా గోవులను అందజేస్తారు. వాటిని కొండ కింద గోశాల ఏర్పాటు చేసి వాటిని సంరక్షించడానికి గుత్తేదారులకు లీజుకిచ్చారు. యథావిధిగా మంగళవారం ఆవులను మేతకు తీసుకెళ్లగా పరిసర ప్రాంతంలో మేత మేస్తూ ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడే అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన పశువుల కాపరి ఆవుకు నీళ్ల తాగించి సపర్యలు చేసి గోశాల వద్దకు తీసుకొచ్చారు. గోశాల వద్ద మంగళవారం రాత్రి ఆవు మృతి చెందింది. ఈ ఘటనపై గోశాల ఇన్‌చార్జి సురేంద్రరెడ్డితో ఈ విషయంపై మాట్లాడగా పాముకాటుకు గురై ఆవు మృతి చెందినట్లు చెప్పడం గమనార్హం.